క్లుప్తంగా

ప్రమాదాల నివారణపై అవగాహన



ఉప్పాడ తీరప్రాంతంలో ఆపద మిత్రులు

కొత్తపల్లి: మాఘపౌర్ణమి సందర్భంగా పుణ్య స్నానాలు ఆచరించేందుకు ఉప్పాడ తీరానికి వచ్చిన భక్తులకు ఆదివారం ఆపద మిత్రులు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించా రు. ప్రభుత్వం ఇటీవల ఆపదలో చిక్కుకున్న వారిని రక్షించడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆపద మిత్రులను నియమించింది. వారికి సామర్లకోట టీటీడీసీలో శిక్షణ ఇచ్చారు. సముద్ర స్నానాలు చేసే సమయంలో ఎటువంటి ప్రమాదం జరగకుండా తీర ప్రాంతంలో ఆపద మిత్రులు పర్యవేక్షించారు. లైఫ్ జాకెట్, పలు పరికరాలను కూడా అందుబాటులో ఉంచారు.

అన్నదానం



ఉప్పాడలో భోజనాలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ఉప్పాడ తీరంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల పిండి వంటలతో పెళ్లి విందు తలపించేలా అన్నదానం నిర్వహించారు. సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

నూకాలమ్మ తల్లిని దర్శించిన దొరబాబు



అమ్మవారికి మొక్కు చెల్లిస్తున్న దొరబాబు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ ఆలయంలో ఆదివారం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ప్రత్యేక పూజలు చేశారు. వారం రోజులుగా చికెన్‌పాక్స్‌తో బాధ పడుతున్న ఆయన జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ వీరభద్రరావు, ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామిలతో పాటు పార్టీ నాయకులతో కలిసి మొక్కు చెల్లించారు. అమ్మవారికి వస్త్రాలను సమర్పించగా ఈఓ టీవీ సూర్యనారాయణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

వైభవంగా మాండవ్యనారాయణ గ్రామోత్సవం



సామర్లకోటలో సాగుతున్న మాండవ్యనారాయణుని గ్రామోత్సవం

సామర్లకోట: పురాతన మాండవ్యనారాయణుని గ్రామోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో సాగింది. మాఘ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో స్వామికి ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం కాలిబాట వంతెన మీదుగా ఫ్లైఓవర్, స్టేషన్ సెంటర్, గాంధీ చౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి. నీలమ్మచెరువు, దేవిచౌక్ మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. ఇళ్ల వద్దకు వచ్చిన స్వామి వారిని గృహస్తులు దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

వైద్య శిబిరం నిర్వాహకులకు సత్కారం



మెడికల్ క్యాంప్ నిర్వాహకులను సత్కరించిన వాకర్స్ సభ్యులు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రతీ నెల ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరం నిర్వాహకులకు ఆదివారం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సత్కరించింది. ప్రతి నెల సుమారు 200 మందికి పరీక్షలు చేస్తున్న సైఫుల్లా, జి.సతీష్‌లను వాకర్స్ సీనియర్ సభ్యుడు విప్పర్తి కొండలరావు నాయకత్వంలో సత్కరించారు. వాకర్స్ సభ్యులు థామస్, మద్దాల వెంకన్న, ఎల్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పాడ తీరం.. భక్తజనసంద్రం

- సముద్రస్నానాలకు పోటెత్తిన భక్తులు
- ఘనంగా ఉప్పాడ తీర్థం



తీరంలో పితృ దేవతలకు కదలీ ఫలాలు సమర్పిస్తున్న భక్తులు

కొత్తపల్లి: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని పుణ్య స్నానాలు ఆచరించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఉప్పాడ సాగరతీరం ఆదివారం జనసంద్రమైంది. వేలాది మంది భక్తులు ఉప్పాడ సాగర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. సాంప్రదాయం ప్రకారం తెల్లవారుజామున పండితులు పిఠాపురంలో వేంచేసిన కుంతీ మాధవస్వామిని (దొంగ దేవుడు) ఊరేగింపుగా తీరానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి శ్రీచక్రస్నానం నిర్వహించారు. సెలవురోజు కావడంతో తీరానికి భక్తుల తాకిడి మరింత పెరిగింది. ఉదయం నుంచి వివిధ వాహనాలపై భక్తులు సముద్రస్నానాలకు తరలివచ్చారు. సుమారు 50 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు భక్తులు ఆచరించారు. ఎక్కువ మంది భక్తులు సుబ్బంపేట తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉప్పాడ తీర్థం వైభవంగా జరిగింది. భక్తులు తమ పితృ దేవతలకు కదలీ ఫలాలను సమర్పించారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్సై రామలింగేశ్వరరావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉప్పాడ సాగర తీరంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు సమీపంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లి మండలం నుంచే కాకుండా పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, బిక్కవోలు, పెద్దాపురం, కిర్లంపూడి, కాకినాడ రూరల్, తొండంగి తదితర మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తీర్థంలో సందడి చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.



ఉప్పాడలో కుంతీమాధవస్వామి ఊరేగింపు



ఉప్పాడ తీరంలో చక్రస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



తీరంలో భక్తులు ప్రత్యేక పూజలు

తగలబడిన చెట్టుతో ఉత్కంఠకు తెర

- పోలీసుల చొరవతో ట్రాఫిక్ మళ్లింపు
- 18 గంటల పాటు ఆందోళనకు గురైన స్థానికులు



చెట్టును నరికించి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్న ఎస్సై సురేష్

పెద్దాపురం: ప్రత్తిపాడు-సామర్లకోట ప్రధాన రహదారి పెద్దాపురం మండలంలో దివిలి జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని ఉన్న నిద్రగన్నేరు చెట్టుకు నిప్పు అంటుకోవడంతో సుమారు 18 గంటలకు పైగా ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం రాత్రి 7 గంటల సమయంలో చెట్టుకు అంటుకున్న నిప్పు ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు కాలుతుండడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ యంత్రాంగం అక్కడే ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. ఎస్ఐ వెలుగుల సురేష్ ప్రత్తిపాడు వైపు వచ్చే వాహనాలను సామర్లకోట, పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం మీదుగా విరవాడ, విరవ, చంద్రమాంపల్లి బ్రిడ్జికి వైపు మళ్లించారు. అలాగే సామర్లకోట వైపు వచ్చే వాహనాలను చంద్రమాంపల్లి బ్రిడ్జి నుంచి పిఠాపురం మండలం విరవ, విరవాడ, ఎఫ్‌కే పాలెం మీదుగా సామర్లకోట చేరుకునేలా మళ్లించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. భారీ వృక్షం కావడంతో మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నం ఆదివారం సాయంత్రానికి ఫలించింది. చెట్టు కొమ్మల సమీపంలోని ఇంటిపైకప్పుపై పడడం మినహా ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ద్వాదశ రథయాత్రకు ఘన స్వాగతం

పెద్దాపురం: కాకినాడ నుంచి భద్రాచలం వరకు నిర్వహించే ద్వాదశ రథయాత్ర ఆదివారం ఉదయం పెద్దాపురం చేరుకుంది. సుమారు 500 మంది స్వాములు పాదయాత్రగా భద్రాచలం వెళ్తున్న నేపథ్యంలో రథయాత్రకు పెద్దాపురంలో ఘన స్వాగతం లభించింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామనామ సంకీర్తనలతో పురవీధుల్లో ముందుకు సాగిపోయారు.



పెద్దాపురంలో ద్వాదశ రథయాత్ర

ఆటో బోల్తా

- ఇద్దరికి గాయాలు

పిఠాపురం: కత్తిపూడి-పిఠాపురం బైపాస్ రోడ్డులో ఆదివారం ప్రమాదవశాత్తూ ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలైనట్టు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కత్తిపూడి నుంచి పిఠాపురం వైపు వెళుతున్న ఆటో చేబ్రోలు జంక్షన్ వద్ద ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న జి.బేబీస్, జి.తులీప్‌లకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో గాయపడిన తులిప్

దేశ సంస్కృతిని చాటిచెప్పిన విశ్వనాథ్

సామర్లకోట: దేశ సంస్కృతి, సంప్రదాయాలను తన సినిమాల ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన మహా వ్యక్తి కె.విశ్వనాథ్ అని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అన్నారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో పట్టణ కళాకారుల ఆధ్వర్యంలో విశ్వనాథ్ సంతాప కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని సినిమాల ద్వారా ఆయన చేసిన సేవలను కొనియాడారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, జర్నలిస్టు అడపా వెంకట్రావు, మదర్‌థెరిస్సా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు, నియోజకవర్గ కళాకారుల సంఘ ప్రతినిధులు బడుగు సీతారామరాజు, గిడుతూరి శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై గరగారావు

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మాఘ మాసం, పౌర్ణమి ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జామున అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. పూజల అనంతరం స్వామిని, అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామి వారు

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



తునిలో హెల్మెట్ ధరించిన వాహనదారుడికి గులాబీ ఇచ్చి అభినందిస్తున్న ఎస్సై గోపాలకృష్ణ

జగ్గంపేట: ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్థానిక ఎస్సై విద్యాసాగర్ సూచించారు. జగ్గంపేటలో ఆదివారం హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి పుర వీధులు, జాతీయరహదారి మీదగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్సై విద్యాసాగర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలకు రక్షణ ఉంటుందన్నారు. కార్లు, మోటారు సైకిళ్లపై ప్రయాణించేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఏఎస్సై నూకరాజు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్ష

తుని: హెల్మెట్‌ధారణ ప్రాణాలకు రక్షణగా నిలుస్తుందని పట్టణ ఎస్సై సీహెచ్ గోపాలకృష్ణ అన్నారు. స్థానిక గొల్లప్పారావు సెంటర్‌లో ఆదివారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన ద్విచక్రవాహనదారులకు గులాబీలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై గోపాలకృష్ణ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



ఆలయంలో చండీహోమం చేస్తున్న పండితులు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రాల నడుమ హోమం నిరహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జిల్లా వీఆర్వోల సంఘ కార్యదర్శిగా చంటిబాబు

తుని రూరల్: కాకినాడ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) సంఘం కార్యదర్శిగా తుని మండలం ఎస్.అన్నవరం వీఆర్వో కొట్టేటి చంటిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడలో ఆదివారం సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘ సభ్యులు తనను జిల్లా కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చంటిబాబు తెలిపారు. జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన చంటిబాబుకు తుని, తొండంగి, కోటనందూరు మండలాల వీఆర్వోలు శుభాకాంక్షలు తెలిపారు.



నీడ లేని 'సాధారణ' ప్రయాణం

- ఫ్లాట్‌ఫాం చివర షెడ్లు లేక అవస్థలు
- రెండో కాలిబాట వంతెన నిర్మించాలని స్థానికులు, ప్రయాణికుల డిమాండ్
- ఎంపీ గీత ఒత్తిడితో నిధుల మంజూరు



తొలగించిన కాలిబాట వంతెన స్తంభాలు



సామర్లకోట రైల్వే స్టేషన్

సామర్లకోట: సాధారణ రైలు ప్రయాణికుల కష్టాలు అధికారులకు పట్టడంలేదు. స్థానిక రైల్వే స్టేషన్‌లో సాధారణ భోగీలు ఆగే ఫ్లాట్‌ఫారాలపై షెడ్లు లేకపోవడం, మూడు ఫ్లాట్‌ఫారాలకు ఒకటే కాలిబాట వంతెన ఉండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇటు రాజమహేంద్రవరంవైపు వెళ్లాలన్నా, అటు విశాఖపట్నం వైపు వెళ్లలన్నా ఫ్లాట్ ఫారాలు దాటాలంటే ఒకటే కాలిబాట వంతెన దిక్కవుతోంది. రెండో వంతెన నిర్మించాలని ఎన్ని వినతులు ఇచ్చినా అధికారులు పట్టించుకోడం లేదు. రైలు వచ్చే సమయంలో ఏ ఫ్లాట్‌ఫాం మీదకు రైలు వస్తుందో ఆ ఫ్లాట్‌ఫాంకు దగ్గరగా ఉన్న కాలిబాట వంతెన వినియోగించుకునే వెసులుబాటు ఉంటుందని ప్రయాణికులు అంటున్నారు.

ఎంపీ పోరాటంతో రెండో వంతెనకు నిధులు..

గతంలో జీఆర్పీ స్టేషన్ వద్ద కాలిబాట వంతెన ఉండేది. దానిని తొలగించి పార్శిల్ కార్యాలయం వద్ద కాలిబాట వంతెనతో పాటు లిఫ్టు ఏర్పాటు చేశారు. జీఆర్పీ స్టేషన్ వద్ద ఉన్న వంతెన కూల్చే సమయంలో అక్కడ ఎస్క్యులేటర్‌తో కూడిన వంతెన ఏర్పాటు చేస్తామని రైల్వే అధికారులు హామీ ఇచ్చి ఆనక విస్మరించారు. దాంతో ఎంపీ వంగా గీత కృషితో ఫ్లాట్‌ఫాం అభివృద్ధికి రూ.2.21 కోట్లు మంజూరయ్యాయి. నిత్యం సుమారు 35 రైళ్ల రాక పోకలతో వేలాది మంది ఈ సామర్లకోట స్టేషన్ నుంచి ప్రయాణిస్తారు.

సాధారణ ప్రయాణికులపై శ్రద్ధ లేదు...



కోవిడ్ అనంతర కాలంలో ప్యాసింజర్లను తొలగించడం, ఎక్స్‌ప్రెస్‌లు రావడం, వాటిలో సాధారణ భోగీలు రెండు చివరల్లో ఉండడంతో ప్రయాణికుల అవస్థలు మరింత పెరిగాయి. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఎంపీ నిధులు మంజూరు చేయించారు. సాధారణ భోగీలు ఆగే ప్రాంతాల్లో షెడ్లు నిర్మించాల్సి ఉంది.

– మద్దాల శ్రీను, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, సామర్లకోట

జీఆర్పీ స్టేషన్ సమీపంలో రెండో వంతెన..



రెండో వంతెన జీఆర్పీ స్టేషన్ దాటిన తరువాత నిర్మించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఫ్లాట్‌ఫారాల చివర షెడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఉన్నాం. రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల రాక పోకలు, సరకుల ఎగుమతి దిగుమతిని దృష్టిలో ఉంచుకొని సామర్లకోట రైల్వే స్టేషన్‌ను గ్రేడ్ 'బి' స్టేషన్‌గా గుర్తించారు.

– ఎం. రమేష్, స్టేషన్ మేనేజరు, సామర్లకోట

బ్లేడుతో చేయి కోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి: తన భార్య కాపురానికి కాపురానికి రావడం లేదని ఒక వ్యక్తి బ్లేడుతో చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు స్థానిక పోలీసులు ఆదివారం తెలిపారు. వారు తెలిపిన కథనం ప్రకారం మండలంలోని కొత్త మూలపేటకు చెందిన వాకపల్లి సింహాద్రి అప్పారావు భార్య తన భర్తతో ఉన్న మనస్పర్థలతో అదే ఊరిలో ఉన్న తన పట్టింటిలో కొద్ది కాలంగా ఉంటోంది. ఆదివారం అప్పారావు అత్తవారింటికి వెళ్లి తన ఇంటికి రావాలని, తన బిడ్డను తనకు ఇవ్వాలని అడిగాడు. ఆమె ససేమిరా అనడంతో మనస్తాపానికి గురై బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అతన్ని వెంటనే పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

యువకుడికి గాయాలు

కాకినాడ క్రైం: ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు తన కాలి వేలును కోల్పోయాడు. కాకినాడ సూర్యారావుపేట మాదిరెడ్డి వారి వీధికి చెందిన ఇమ్మంది పవన్‌సాయి (24) ఆదివారం తన తల్లికి అనారోగ్యం కావడంతో మందులు కొనేందుకు బైక్‌పై బాలాజీ చెరువు కూడలికి బయల్దేరాడు. సాలిపేట గర్ల్స్ హైస్కూల్‌ను సమీపించే సరికి ఎదురుగా వస్తున్న మరో బైక్ పవన్ సాయిని ఢీకొంది. ఈ ఘటనలో సాయి ఎడమకాలి బొటన వేలు తెగిపడింది. తక్షణమే అతడిని కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారు. ఈ ఘటనపై కాకినాడ త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

తప్పిన ప్రమాదం

కాకినాడ రూరల్: కాకినాడ-పిఠాపురంలో మార్గంలో రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద ప్రయాణికులతో వెళుతున్న వాహనానికి ఆదివారం పెద్ద ప్రమాదం తప్పింది. కాకినాడ వైపు వస్తున్న వాహనం అదుపు తప్పి ఏపీఎస్పీ పక్కన కల్వర్టులోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏ విధమైన గాయాలు అవ్వలేదు. దీంతో వాహన డ్రైవర్, అందులో ఉన్న వారు ఊపిరిపీల్చుకున్నారు. అదుపు తప్పి పక్కకు దూసుకుపోయిన వాహనం వద్దకు పెద్ద ఎత్తున స్థానికులు, ఈ మార్గంలో ప్రయాణించేవారు చేరుకుని, లోపలి ఉన్న వారు క్షేమంగా ఉన్నట్టు తెలుసుకుని కుదుటపడ్డారు.

ప్రత్యంగిర హోమం

అన్నవరం: మాఘ పౌర్ణమి సందర్భంగా రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ఆదివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11.30 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

నమో భావనారాయణా..

- సర్పవరం క్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- కుటుంబ సమేతంగా హాజరైన ఎమ్మెల్యే కురసాల

కాకినాడ రూరల్: నారద మహర్షి ప్రతిష్ఠించిన సర్పవరం క్షేత్రం భక్త జనసంద్రమైంది. ఏటా మాఘ ఆదివారం తిరునాళ్ళు జరుగుతాయి. శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి కొలువైన ఈ క్షేత్రంలో మూడో ఆదివారం సుమారు 50వేల మంది భక్తులు వచ్చినట్టు దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ విజయలక్ష్మి తెలియజేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ పాలక మండలి చైర్మన్ పుల్ల నారాయణరావు, పుల్ల చంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పుల్ల చందు, సర్పంచ్ శీలం చిన్న, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ సభ్యుడు పుల్ల చక్రధర్, సురేంద్ర తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. పాతాళ భావనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లి దండ్రులు, సోదరుడు, కుటుంబ సభ్యులతో కలసి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈఓ, చైర్మన్‌లు వారికి తీర్థ ప్రసాదాలు అందించారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

ఆలయానికి వచ్చిన భక్తులకు గ్రామ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు పి.వెంకట్రావు, మాజీ గవర్నర్ బండి శ్రీనివాసరావు, కోశాధికారి గణపతి, డాక్టరు సత్తిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

కొత్త గైగోలుపాడులో కోదండ రామాలయ శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కడియాల చిన్నా తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు, సత్యనారాయణ, కల్యాణ్‌కృష్ణ



సర్పవరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



మజ్జిగ పంపిణీ చేస్తున్న వాకర్స్ సభ్యులు